RNI APTEL/25/A0798


# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/


ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:60 20-8-2025 బుధవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /

## పీ4.. సమాజానికి తిరిగి ఇవ్వాలనే 'గివ్ బ్యాక్' సిద్ధాంతం: సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు19 (టుడే విదుర): పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (మంగళవారం) ప్రారంభించారు. పేదరికాన్ని సమూ లంగా, శాశ్వతంగా నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. పీ4ను ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తొలిదశలో 15 లక్షల బంగారు కుటుంబాల ఎంపికపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. మార్గదర్శుల ఎంపికపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు. పీ4 సంబంధిత మార్గదర్శులతో ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రత్యేక భేటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇవాళ పీ4 పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పీ4 చాలామంది జీవితాల్లో గొప్పమార్పు అవుతుం దని ఉద్ఘాటించారు. ఇంటర్ పాస్ అయిన అమ్మాయికి రెండు నెలల్లో ట్రైనింగ్ ఇచ్చి నెలలో ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించామని చెప్పు కొచ్చారు. ఆ అమ్మాయి భవిష్యత్తులో మార్గదర్శి కావాలని కోరుకుంటుందని తెలిపారు సీఎం చంద్రబాబు.

## ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్టు 19(టుడే విదుర): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తమ అభ్యర్థిని ఇండియా కూటమి ఖరారు చేసింది. తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి పేరును ఇండియా కూటమి మంగళవారం ఖరారు చేసింది. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి.. గతంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తిగా పని చేశారు. 2007 నుంచి 2011 మధ్య సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విధులు నిర్వహిం చారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా సైతం ఆయన పని చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం.ఉప రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం చేయాలని మోదీ ప్రభుత్వం లోని పలువురు కేంద్ర మంత్రులు ఆశలపై ఇండియా కూటమి నీళ్లు చల్లింది. ఆ క్రమంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తీసుకువచ్చింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో దక్షిణాదికి ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు సీపీ రాధాకృష్ణన్‌ను తమ అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఇండియా కూటమి సైతం ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన వ్యక్తినే ఎంపిక చేయాలని భావించింది. అందులో భాగంగా తెలంగాణకు చెందిన జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరును ఎవరూ ఊహించని విధంగా తెర పైకి తీసుకు వచ్చింది.

## వైసీపీ నేతలకు హోంమంత్రి వార్నింగ్..




అమరావతి, ఆగస్టు 19 (టుడే విదుర): వైసీపీ నేతల తీరుపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి టీవీ, పేపర్‌లో అవాస్తవాలను వాస్తవాలుగా ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. 14 నెలల కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు చేపట్టామని.. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారామె. వీటిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలతో ఎదురుదాడి చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ వైసీపీపై హోంమంత్రి అనిత తీవ్ర విమర్శలు చేశారు. అబద్దాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ హయాంలోనూ అవే అవాస్తవాలను ప్రచారం చేశారని దుయ్యబట్టారు. ఉదయం లేచింది మొదలుకొని అమరావతి మునిగిపోయింది అని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో నిర్మాణాల వద్ద పునాదుల వద్ద కాస్త నీరు చేరవా అని ఆమె ప్రశ్నించారు. నెగిటివ్ యాంగిల్‌లో సోషల్ మీడియాలో ప్రోజెక్ట్ చేయడం దారుణమన్నారు. అమరావతి మహిళా రైతులు నాడు బయటకు వచ్చి పాదయాత్రలు చేసి అమరావతిని నిలబెట్టారని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ అమరావతిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ హోంమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి మునిగిపోతుంది.. పొన్నూరు వైపు నీటిని డైవర్ట్ చేశారని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని అనిత ఫైర్ అయ్యారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## తాడిపత్రి అరాచకాలపై సిట్‌తో విచారణ జరపాలి: పెద్దారెడ్డి



అనంతపురం, ఆగస్టు 19 (టుడే విదుర):పోలీసులను అడ్డ పెట్టుకుని టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. మంగళవారం అనంతపురం లో కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తాడిపత్రికి వెళ్లాలంటే వీసా కావాలా? అని ప్రశ్నించారు. తాడిపత్రి వెళ్లాలంటే జేసీ ప్రభాకర్ రెడ్డి అనుమతి కావాలా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. అందుకోసం.. పోలీసులు చెబితే తాను దరఖాస్తు చేస్తానంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. తనపై పోలీసులు ఆంక్షలు పెట్టడం దుర్మార్గమని చెప్పారు.ఆ క్రమంలో తాను ఎక్కడికి వెళ్లినా.. పోలీసులు తన వెంట పడుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి పోలీసుల వైఖరి ఏకపక్షంగా ఉ ందని విమర్శించారు. తాడిపత్రిలో వైసీపీ నేతలపై జేసీ వర్గీయులు దాడులు చేస్తున్నా... పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జేసీ ప్రభాకర్ రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే అభివృద్ధిలో పోటీ పడాలంటూ ఈ సందర్భంగా కేతిరెడ్డి సవాల్ విసిరారు.

## వైసీపీ విష ప్రచారానికి ఆ 11 సీట్లు కూడా రావు.. మంత్రి నారాయణ వార్నింగ్



అమరావతి, ఆగస్టు19(టుడే విదుర): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై మీ ఏడుపులు ఇకనైనా ఆపాలని హితవు పలికారు. కొండవీటి వాగు ప్రవావాహానికి ఆటంకం వల్ల నీరు నిలిచిపోయిన నీరుకొండ పరిసర ప్రాంతా లను మంత్రి నారాయణ (మంగళవారం) పరిశీలిం చారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడా రు. పశ్చిమ బైపాస్ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణంతో కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో మట్టిని అడ్డు వేసి వదిలేయడం తో వాగు ప్రవాహానికి ఇబ్బందులు వచ్చాయని వివరించారు మంత్రి నారాయణ.

## అమరావతిపై జగన్ మీడియా అసత్య ప్రచారం.. కొలికపూడి ధ్వజం




ఎన్టీఆర్ జిల్లా, ఆగస్టు19 (టుడే విదుర): అమరావతిపై విషపు రాతలు రాస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చకు తాను సిద్ధమని.. జగన్ మోహన్ రెడ్డి సిద్ధమా, లేకపోతే వైసీపీ నుంచి ఎవరూ వచ్చినా తాను చర్చించడానికి సిద్ధంగా ఉ న్నానని సవాల్ విసిరారు. గత వారం రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నా యని తెలిపారు. చిన్నపాటి వర్షానికే అమ రావతి మునిగిందని జగన్ తన మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.

## వైసీపీకి బిగ్ షాక్... కీలక నేతపై కేసు




గుంటూరు జిల్లా, ఆగస్టు19 (టుడే విదుర) : పొన్నూరు వైసీపీ ఇన్‌చార్జ్ అంబటి మురళిపై చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అమరావతి వల్లే పొన్నూరు పొలాలు మునిగాయని అంబటి మురళి అసత్య ప్రచారం చేశారని అప్పాపురం కాలువ ఏఈఈ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు చేబ్రోలు పీఎస్‌లో కేసు నమోదైంది. విపత్తుల పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేశారని ఏఈఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబటి మురళితోపాటు సాక్షి ఛానల్‌పైనా కేసు నమోదు చేశారు.

## వాయుగుండంగా మారిన అల్పపీడనం.. భారీ వర్ష సూచన..



విశాఖపట్నం, ఆగస్టు 19 (టుడే విదుర): వాతావరణ పరిస్థితిపై వైజాగ్ తుపాను హెచ్చరిక కేంద్రం జగన్నాథ్ కుమార్ కీలక సమాచారం ఇచ్చారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని చెప్పారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. ఒరిస్సాలోని భవానీ పట్నానికి 90 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందన్నారు. ఈ వాయుగుండం దక్షిణ ఒరిస్సా, దక్షిణం చత్తీస్‌ఘడ్ మీదుగా ప్రయాణించి అల్ప పీడనముగా బలహీనపడే అవకాశం ఉ ందన్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని జగన్నాథ్ తెలిపారు.

## అనంతపురం టీడీపీ నేతల మధ్య గ్రూప్ రాజకీయాలు.. హై కమాండ్ విచారణ

అమరావతి, ఆగస్టు 19(టుడే విదుర): అనంతపురం అర్బన్ పంచాయతీపై తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ హై కమాండ్ చర్చించింది. తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలోని కమిటీ వద్ద అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి హాజరై వివరణ ఇచ్చారు. అయితే, కమిటీ వద్దకు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ రాలేదు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అందుబాటులో ఉన్నప్పుడు రావాలని ఎమ్మెల్యేకు అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మీడియాతో మాట్లాడారు. అనంతపురం పరిణామాలపై పల్లా శ్రీనివాసరావు ఫోన్ చేసి అడిగితే స్వయంగా కలుస్తానని చెప్పడంతో టీడీపీ కార్యాలయానికి రమ్మనడంతో వచ్చానని తెలిపారు. టీడీపీకి, ప్రజలకు ఇబ్బంది కలిగినప్పుడు బాధ్యతగా స్పందించిన తీరు అధిష్టానానికి వివరించానని అన్నారు. తాను సీటు వదులుకున్నానని, తనకు గ్రూపులతో పనేంటని ప్రశ్నించారు. భవిష్యత్తులో పోటీచేసే ఆలోచన కూడా లేనప్పుడు గ్రూపు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజలు తన వద్దకు సమస్యలతో వచ్చినప్పుడు వాటి పరిష్కారానికి తన వంతు బాధ్యతగా స్పందిస్తున్నానని ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి




బనగానపల్లె,ఆగస్టు 19(టుడే విదుర): పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తోన్న డ్రైయిన్ల అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్థంభాల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న విద్యుత్ స్థంభాలను పక్కకు తరలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముస్లిం మైనార్టీల కోసం నిర్మిస్తున్న షాదీఖానా భవన నిర్మాణ పనులను మంత్రి బిసి పరిశీలించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ నాగ శ్రీనివాసులు, తహసిల్దారు నారాయణరెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి నాయకులు రహీం నాయక్, సయ్యద్ హుస్సేన్ నియాజి, క్రిష్ణ నాయక్, పసుపుల షేక్షావలి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నందమూరి పద్మజ భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళి

హైదరాబాద్:ఆగస్టు 19(టుడే విదుర): నందమూరి పద్మజ భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు,లోకేశ్ నివాళులర్పించారు. ఎన్టీఆర్ పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ అనారోగ్యంతో బాధపడుతూ ఇవాళ ఉదయం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జయకృష్ణ నివాసానికి వెళ్లిన సీఎం చంద్రబాబు.. పద్మజ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జయకృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## నాయుడుపేట వాసులకో గుడ్ న్యూస్.. అదేంటో తెలిస్తే..

### చర్లపల్లి-చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నాయుడుపేటలో రెండు నిమిషాలు హాల్టింగ్



హైదరాబాద్ సిటీ:ఆగస్టు 19(టుడే విదుర): చర్లపల్లి నుంచి చెన్నై వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12604)కు నాయుడుపేట్ లో అదనపు స్టాపేజీ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈరోజు నుంచి నాయుడుపేట్ రైల్వే స్టేషన్‌లో రెండు నిమిషాల పాటు రైలు ఆగుతుందని (హాల్టింగ్) దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు, ప్రజా ప్రతినిధుల నుంచి అందిన వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మన గుడి-మన బాధ్యత



తిరుమల, ఆగస్టు 19(టుడే విదుర): నంద్యాలకు చెందిన 'మనఊరు-మనగుడి-మనబాధ్యత' సంస్థ వ్యవస్థాపకుడు శివకుమార్ ఆధ్వర్యంలో దాదాపు వంద మంది సేవకులు దేశంలోని వివిధ క్షేత్రాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టీటీడీ అనుమతి తీసుకున్న వీరు..ఈ నెల 12వ తేదీ నుంచి వరకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడక మార్గాలు, శిలాతోరణం, వేదపాఠశాల వంటి వివిధ ప్రాంతాల్లో చెత్తను సేకరించారు.ప్రధానంగా ప్లాస్టిక్ తొలగింపుపై దృష్టిసారించి వారంరోజుల్లో 3 నుంచి 4 టన్నుల చెత్తను సేకరించి తొలగించారు. ఈసందర్భంగా ఫౌండర్ శివకుమార్ మాట్లాడుతూ..తాను ఓ ప్రభుత్వ ఉద్యోగినని, కొంతకాలంగా వారణాశి, అరుణాచలం, శ్రీశైలం, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో చెత్తను తొలగిస్తూ సేవ చేస్తున్నామన్నారు.ఇందులో భాగంగా తిరుమలలోనూ స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

# ఉద్రిక్తతల నడుమ చలో కరేడు



ఉలవపాడు, ఆగస్టు 19(టుడే విదుర): ఉద్రిక్తతల నడుమ మధ్య రైతు, ప్రజాసంఘాల నాయకులు తలపెట్టిన 'చలో కరేడు' కార్యక్రమం ముగిసింది. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు ప్రాంతంలో ప్రభుత్వం ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం బలవంతపు భూసేకరణ చేపడుతోందని పేర్కొంటూ.. ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కరేడు, చుట్టుపక్కల గ్రామాల్లో పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్లు అమల్లో ఉన్నందున 300 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఇండోసోల్ కంపెనీ కరేడు నుంచి వెళ్లిపోవాలని సోమవారం ఉదయం రైతులు, గ్రామస్థులతో కలిసి శివాలయంలో పూజలు చేసి, స్వామివారి వద్ద ఓ వినతిపత్రాన్ని ఉంచారు. పచ్చని పొలాలతో కళకళలాడుతున్న గ్రామం జోలికి రావద్దని ఉద్యమ నేతలు హెచ్చరించారు. మరోవైపు కరేడులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఎం, ప్రజాసంఘాలు, రైతు కూలీ సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం పోలీస్ స్టేషన్లకు తరలించారు. భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి ప్రభుత్వం ప్రజలను ప్రలోభాలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు.

# విశాఖలో తుపాకీ కాల్పుల కలకలం

### బొగ్గు దొంగతనాలకు పాల్పడే ఇరువర్గాల మధ్య పాతకక్షలు కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలు, కేజీహెచ్‌కు తరలింపు ఘటన వెనుక మాజీ పోలీసు కానిస్టేబుల్ ఉన్నట్లు అనుమానం పోలీసుల అదుపులో నిందితులు?

మహారాణిపేట (విశాఖపట్నం), ఆగస్టు 19(టుడే విదుర): విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో అర్ధరాత్రి తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. తూటా తగిలి గాయపడిన యువకుడు ఆస్పత్రిపాలయ్యాడు. ఈ ఘటన వెనుక మాజీ కానిస్టేబుల్ హస్తమున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాలివీ.. వన్‌టౌన్ ప్రాంతానికి చేపల రాజేష్, వాసుపల్లి నరేష్ స్నేహితులు. గోడ నూకరాజు, జంపా దిలీప్ మరో వర్గం. వీరంతా బొగ్గు దొంగతనాలకు పాల్పడుతూ ఉంటారు.ఇరువర్గాల మధ్య పాత కక్షలున్నాయి.ఆదివారం రాత్రి పది గంటల సమయంలో నలుగురూ వన్‌టౌన్‌లోని చిలకపేట వద్ద కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి రాజేష్‌పై నూకరాజు కత్తితో దాడికి యత్నించాడు. రాజేష్ ఆ కత్తి లాక్కుని నూకరాజుపై ప్రతిదాడికి యత్నించగా నూకరాజు పారిపోయాడు. మళ్లీ రాత్రి 11 గంటల సమయంలో నలుగురూ అదే ప్రదేశానికి చేరుకున్నారు.ఈసారి నూకరాజు తుపాకీ తీసుకొచ్చి రాజేష్‌ను కాల్చాడు. పొట్ట దిగువ భాగంలో తూటా దిగడంతో రాజేష్ కుప్పకూలిపోయాడు. అతడిని కేజీహెచ్‌కు తరలించగా, వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి ఐసీయూలో ఉంచారు. అయితే ఈ ఘటన వెనుక ఒక మాజీ కానిస్టేబుల్ హస్తం ఉన్నట్లు భావిస్తున్నారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఆ కానిస్టేబుల్ పోర్టులో బొగ్గు లోడింగ్, అన్‌లోడింగ్ వ్యాపారం చేస్తున్నారు. గత అక్టోబరు నుంచి ఉద్యోగానికి వెళ్లడం లేదు. బొగ్గు దొంగతనాలకు సంబంధించి రాజేష్‌తో అతడికి విభేదాలు ఉన్న నేపథ్యంలో నూకరాజుకు తుపాకీ ఇచ్చి పంపించింది అతడేనని పోలీసులు అనుమానిస్తున్నారు. అతడు కూడా పరారీలో ఉన్నాడు.అది నాటు తుపాకీనా, సాధారణ తుపాకీనా అనేది ఇంకా ధ్రువీకరించలేదు. నూకరాజు, దిలీప్‌లను శ్రీకాకుళంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం



శ్రీకాకుళం క్రైం,ఆగస్టు 19(టుడే విదుర): కొద్ది రోజుల నుంచి వార్తల్లో నిలిచిన పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆత్మహ త్యాయత్నం చేసు కున్నారు. ఆ వివరాలిలా ఉన్నా యి.. శ్రీకాకుళం నగరంలో తిలక్‌నగర్‌లో నివసిస్తున్న ఆమె ఉదయం ఓ సోషల్‌మీడియాతో మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో ఇంటిలో సౌమ్య పడిపోవడంతో ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డా. శిరీష.. సౌమ్యను అత్యవసర చికిత్స విభాగంలో చేర్పించారు. మధ్యాహ్నానికి ఆమె పరిస్థితి కాస్త మెరుగుపడింది. అక్కడే తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపణలు చేశారని.. తనపై వస్తున్న నెగిటివ్ ట్రోల్స్ తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిపారు. తనను టార్గెట్ చేసి వేధిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఆమె కుమారుడు రాహుల్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పలువురు స్టూడెంట్లకు అడ్మిషన్లు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని, అయితే అప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ముగియడంతో నిబంధనలకు విరుద్ధంగా తన తల్లి అంగీకరించ లేదన్నారు. పొందూరు నుంచి కంచిలి మండలానికి బదిలీ చేశారని.. చాలా వేధింపులకు గురిచేయడంతో తన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

## 21న అంగన్వాడీల నిరసనలు



అమరావతి, ఆగస్టు 19(టుడే విదుర): అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఐసీడీఎస్ ప్రాజెక్టులు, మండల కేంద్రాల్లో నిరసనలు తెలుపనున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ల నాయకులు సుబ్బరావమ్మ, లలితమ్మ, వీఆర్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్పిన జీవోను వెంటనే విడుదల చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలపనున్నట్లు తెలిపారు.


## మూడు వాహనాలు ఢీ నలుగురు మృతి...

## 10మందికి గాయాలు



తనకల్లు,ఆగస్టు 19(టుడే విదుర): మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందారు. మరో పదిమంది గాయపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. బళ్లారికి చెందిన 13 మంది టెంపో ట్రావెల్ వాహనంలో అరుణాచలం, తిరుమల–తిరుపతి క్షేత్ర సందర్శనకు వెళ్లారు. దైవ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద ముందు వెళ్తున్న మరో టెంపో ట్రావెల్‌ను ఓవర్‌టేక్ చేయబోయింది. అదే సమయంలో కదిరి నుంచి మదనపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. ఈ క్రమంలో మూడు వాహనాలు ఢీకొన్నాయి. బళ్లారివాసులు ప్రయాణిస్తున్న వాహనంలోని అనసూయమ్మ (50), జాహ్నవి(4), డ్రైవర్ మణికంఠ(42), నాగేంద్రప్ప (58) మృతిచెందారు. ఆర్టీసీ బస్సు, మరో టెంపో ట్రావెలర్‌లో ఉన్నవారు సురక్షితంగా బయట పడ్డారు.

# పెద్ద పరీక్షే!



పాతపట్నం ఉన్నత పాఠశాలలోపరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

**- నూతన విధానంలో విద్యార్థులకు పరీక్షలు**
**- తెల్లపేపర్లకు బదులు బుక్‌లెట్‌లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం**
**- రాసేందుకు తంటాలు పడుతున్న విద్యార్థులు**
**- భద్రపరచడంలో ఉపాధ్యాయులకు కష్టాలు**

పాతపట్నం,ఆగస్టు 19(టుడే విదుర):: రాష్ట్ర ప్రభుత్వం విద్యారం గంలో సంస్కరణలు తీసుకొస్తుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి వివిధ మార్పులకు శ్రీకారం చుట్టిం ది. పేపర్లకు బదులు బుక్‌లెట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే, ఈ విధానంలో పరీక్షలు రాసేందుకు ఇటు విద్యార్థులు, వాటి నిర్వహణకు అటు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు. గతంలో 1 నుంచి 10వ తరగతి వరకు యూనిట్ టెస్టు లు, క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లి, ఫైనల్ పరీక్షలు జరిగేవి. ఉపాధ్యాయులు విద్యార్థులకు తెల్లపేపర్లు ఇచ్చి వాటిపై పరీక్షలు రాయించేవారు. ఆ పేపర్లకు మూల్యాంకనం చేసి మార్కులు చెప్పేవారు. అయితే, ఈ విద్యాసంవత్సరం పరీక్షల నిర్వహ ణలో ప్రభుత్వం మార్పులు తీసుకొ చ్చింది. ప్రతీవిద్యార్థి నాలుగు ఫార్మే టివ్ (నిర్మాణాత్మక), రెండు సమ్మే టివ్ (సంగ్రహణాత్మక) పరీక్షలు రాయాల్సి ఉంటుంది. దీనికోసం బుక్‌లెట్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పరీక్షలన్నీ ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. సమాధానాలన్నీ అదే బుక్‌లెట్‌లో ఉంటాయి. తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి ఒక్కో బుక్‌లెట్ రూపంలో అసెస్‌మెంట్ ఆన్సర్ షీటు ఉంటుంది. రిఫ్లక్షన్(ప్రతిస్పందన)–5మార్కులు, హోమ్‌వర్క్(రాతఅంశాలు)కు –5మార్కులు, ప్రాజెక్ట్ వర్క్‌కు 5మార్కులు, రాతపరీక్షకు 35మార్కులు కేటాయించారు. పరీక్ష రాయడానికి గంట సమయమిచ్చారు. బుక్‌లెట్ ఓఎంఆర్ షీట్‌లో ఇచ్చిన నిబంధనల మేరకు పరీక్షలు రాయడానికి ఇచ్చే గంట సమయం విద్యార్థులకు సరిపోదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎఫ్ఏ–1 పరీక్షల నిర్వాహణకు ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పరీక్షలు మొదలు కాగానే బుక్‌లెట్ అందుకున్న విద్యార్థి అందులో తన పేరు, క్లాస్, సెక్షన్, రోల్ నెంబర్, స్కూల్ నేమ్, పెన్‌ఐడీ,యు డైస్‌కోడ్ రాయాలి. ప్రశ్నాపత్రంలో మల్టిబుల్ చాయిస్ టిక్ పెట్టుకొని బుక్‌లెట్‌లో జవాబులు రాసే ప్రక్రియ మొదలుపెట్టాలి. ఓఎంఆర్ షీట్‌లో పెన్‌ఐడీ ఎక్జామ్‌కోడ్ రాసిన తరువాతనే బబ్లింగ్ చేయాలి. ఆ తరువాతనే విద్యార్థులు బుక్‌లెట్‌లో ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఈ తతాంగమంతా విద్యాశాఖ ఇచ్చిన నిబంధనల మేరకు ఓ గంటలో ముగించాలి. దీంతో అన్ని సమాధానాలు రాయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

## సాంకేతిక విద్యా బోర్డుకు ఎన్‌సీవీఈటీ గుర్తింపు



అమరావతి, ఆగస్టు 19(టుడే విదుర):రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ బోర్డు(ఎస్‌బీటీఈటీ)కు అరుదైన గుర్తింపు లభించింది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఏపీ ఎస్‌బీటీఈటీకి జాతీయ వృత్తి విద్య శిక్షణ మండలి(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు లభించింది. దీంతో ఇకపై సాంకేతిక విద్య పరిధిలోని కోర్సులకు రాష్ట్ర బోర్డుతోపాటు, ఎన్‌సీవీఈటీ గుర్తింపుతో కలిపిన డ్యూయల్ సర్టిఫికేషన్ విద్యార్థులకు లభిస్తుంది. ఈ మేరకు ఎన్‌సీవీఈటీతో ఎస్‌బీటీఈటీ అధికారులు ఢిల్లీలో ఒప్పందం చేసుకున్నారు.


# మురుగులో మున్నెల్లిరాజుపాలెం

**మున్నెల్లిరాజుపాలెంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు, పక్కన చెత్తకుప్పలు**
**రాజకీయ ఉద్దండులు కలిగిన ఆ గ్రామంలో అధ్వానంగా రోడ్లు పారిశుధ్య లోపం, గుంతల రోడ్లు దర్శనమిస్తున్న వైనం**



బి.కోదూరు. ఆఆగస్టు 19(టుడే విదుర): మురుగు లో మున్నెల్లి గ్రామం కొట్టు మిట్టాడుతోంది ఆ గ్రా మంలో ఒకప్పుడు జిల్లారాజకీయాలు శాసించిన వారు ఉన్నారు. ఒకప్పుడు అప్పటి ఎమ్మెల్యే చిదా నందం, తర్వాత శివరామక్రిష్ణారా వుకు ముఖ్య అనుచరులు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయ మ్మ, టీడీపీ ఇనచార్జి రితీష్‌రెడ్డి. ముఖ్య అనుచ రులతోపాటు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధాకు అనుచరులు ఈ గ్రామంలోనే ఉన్నారు. అంతే కాకుండా ప్రస్తుత రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు కూడా ఈ గ్రామానికి చెందినవారే. అదే బికోదూరు మండలం మున్నెల్లి రాజుపాలెం గ్రామం. ఈ గ్రామంలో దాదాపు 400 కుటుంబా లు,1100 మంది జనాభా ఉన్నారు. కొంతమంది మాత్రమే వ్యవసాయం, పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తుంటారు. ఆ గ్రామంలో 2వేలకు పైగా పశువులుఉంటాయి. గ్రామంలో ఒకే ఒక్క వీధి రోడ్డు ఉండగా మిగతా వీధులన్నీ సందులు గొందుల రోడ్లే. ఆ గ్రామంలో జనాభా, పశు వులు ఎక్కువగా ఉండడంతో వీధుల గుండా మురు గుపారుతుంటుంది. వర్షాకాలం వచ్చిందంటే మం డలంలో అన్ని గ్రామాలు ఒక ఎత్తయితే ఆ గ్రా మంలో ఎక్కువగా రోగాలు విష జ్వరాలు వస్తుం టాయి. దోమలు అధికంగా ఉంటాయి సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి డ్రైనేజీ నిర్మిస్తే సమస్య పరి ష్కారమవుతుందని గ్రామస్థులంటున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఎంపీడీవో ఏమన్నారంటే: ఈ విషయమై ఎంపీడీవో భాస్కర్‌రావును వివరణ కోరగా గ్రామంలో రోడ్లపై మురుగగునీరు నిల్వ, ఉన్న మాట వాస్తవమేనన్నారు. అయితే రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు పంచా యతీరాజ్ ఏఈని ఉన్నతాధికారులకు నివేదిక పంపమని చెప్పామన్నారు. కాగా పంచాయతీరాజ్ ఏఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గతం లో సిమెంటు రోడ్డు వేశారని, అది పూర్తిగా దెబ్బ తిని గుంతలు ఏర్పడ దంతో ఇబ్బందులు కలుగు తున్నాయన్నారు. ఈవిషయమై జిల్లా అధికారు లకు నివే దిక కూడా పంపించామని నిధులు మంజూరు చేసిన వెంటనే ఆ గ్రామంలో సిమెం టు రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.నిధులు రాకనే సమస్యలు: గ్రామ పంచాయతీ కి ఎలాంటి నిధులు రాలే దని సొంత గ్రామంలో కూడా తాను ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిం దని, స్థానిక సర్పంచ గురయ్యపేర్కొన్నారు. నిధు లు వచ్చిన వెంటనే గ్రామంలో సమస్య లు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.ల


## వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం




లావేరు/జలుమూరు, ఆఆగస్టు 19(టుడే విదుర):య రహదారిపై ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం గొటివాడ గ్రామానికి చెందిన ముత్తా పవన్ కుమార్ (25) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలివీ... పవన్ కుమార్ విశాఖపట్నంలోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులు, బంధువులతో మూడు రోజులు సరదాగా గడిపాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వైజాగ్ వెళుతుండగా తాళ్లవలస వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొంది. ఈ సంఘటనలో పవన్ కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న గొటివాడ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పవన్‌కుమార్‌కు తల్లిదండ్రులు ఉషారాణి, నర్సింగరావు, సోదరుడు సాయి ఉన్నారు. తండ్రి విశ్రాంత మిలిటరీ ఉద్యోగి. తల్లి గృహిణి. ఇంటి నుంచి బయలుదేరి గంట సమయం గడవక మునుపే కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని వార్త తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి నర్సింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు లావేరు ఎస్ఐ లక్ష్మణరావు చెప్పారు.

## వెలగని విద్యుత దీపాలు.. ఇబ్బందుల్లో ప్రజలు


కొండాపురం,ఆగస్టు 19(టుడే విదుర): ఇటీవల పూర్తయిన ముద్దనూరు–తాడి పత్రి నేషనల్ హైవే-67 పై ఏర్పాటు చేసిన విద్యుతదీపాలు వెలగకపోవ డంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. హైవేపై కొండాపురం పట్టణంలో రోడ్డుకు ఇరువైపుల ఏ ర్పాటుచేసిన విద్యుతలైట్లు అంకార ప్రాయంగా ఉన్నాయి. విద్యుతలైట్లు వెల గకపోవడంతో రాత్రిపూట ప్రజలు అటుఇటూ రోడ్డు దాటుకునేటప్పుడు ఇబ్బందిపడుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. టోల్‌గేట్ ఏర్పాటుచేసి నెలనుంచి టోల్ ఫీజు వసూలు చేస్తున్న ఇంతవరకు లైట్లు వెలగకపోవడంపై స్థానికలు మండిప డుతున్నారు. ఈ లైట్లకు సంబంధించి ఇంతవరకు విద్యుతట్రాన్సఫార్మర్ కూడా ఏర్పాటు చేయలేదని



సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. వెంట నే విద్యుతలైట్లు వెలగకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు.

# కొండ ప్రాంతవాసులకు వర్షాకాలంలో తప్పని తిప్పలు

విజయవాడఆగస్టు 19(టుడే విదుర): ముసురుకున్న వాతావరణంతో నగరంలోని కొండ ప్రాంతాల ప్రజలు గజగజలాడుతున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు పడటంతో కొండలు నానాయి. తాజాగా ముసురు పట్టడంతో మరింతగా నానుతున్నాయి. ఇటీవల ప్రైజర్ పేట కొండపై రిటెయినింగ్ వాల్ విరిగిపడింది. ముసురు వాతావరణం, భారీ వర్షాలతో ఆయా ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నగర జనాభాలో 30శాతం మంది కొండపైనే జీవిస్తున్నారు. ముసురు పట్టినా, నాలుగైదు రోజులు వర్షాలు కురిసినా కొండ ప్రాంతాలు వణికి పోవాల్సిందే. ఇక్కడి ప్రజలకు రక్షణ కల్పించటానికి రిటెయినింగ్ వాల్స్ మాత్రమే పరిష్కారం. ఈ దిశగా అధికార యంత్రాంగాలు ఎప్పుడు కదులుతాయో తెలియని పరిస్థితి. ఇతర ప్రాంతాల తరహాలో విజయవాడ కొండలుండవు. ఇంద్రకీలాద్రి, గుణదల కొండ, గాంధీ కొండ వంటి భారీ కొండ సాణువులు సైతం రాతి, మట్టి కలబోతతో కూడి ఉంటాయి. ఇలాంటి కొండలు జనావాసాలకు సురక్షిత ప్రాంతాలు కావు. దీంతో భారీ వర్షాల సమయంలోనూ, ముసురుపట్టినప్పుడు, కొండలపై మట్టి నాని రాళ్ల బయట పడుతున్నాయి.. ఇవి జనావాసాలపైకి దొర్లటం, రిటైనింగ్ వాల్ కూలడం వంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మొగ్రాజపురం కొండప్రాంతం, గుణదల, చిట్టినగర్, కొత్త



పేట, గొల్లపాలెంగట్టు, సొరంగం, టైనర్ పేట, లంబాడి పేట, రామరాజ్యనగర్ ప్రాంతాల్లో సుమారు 30వేల కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరంతా కూలీనాలీ చేసుకునే పేద, మధ్యతరగతివారు. దశాబ్దాల కిందట నగరానికి వలస వచ్చి కొండలపైనే నివాసం ఏర్పరుచుకుని జీవిస్తున్నారు. గొల్లపాలెం గట్టు, సొరంగం, భీమన్నవారిపేట ప్రాంతంలో జారి పడిన కొండరాళ్లు గతంలో సంభవించిన ఘటనలు మరింత భయాందోళనకు గురిచేస్తున్నాయి. మొగ్రాజపురం సున్నపు బట్టీల సెంటర్ కొండ ప్రాంతంలో గతేడాది ఇదే సమయంలో కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతిచెందారు. గతంలో లంబాడీపేట ప్రాంతంలో గోడకూలి నలుగురు మృతిచెందారు. అప్పటి నుంచి కొండ ప్రాంతాల్లో నివాసితులకు వర్షాకాలం వచ్చిందంటే కంటిపై కునుకు ఉండదు. ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందోనని నిత్యం బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

దీంతో ప్రమాదస్థాయిలో ఉన్న ఇళ్లను గుర్తించి చర్యలు చేపట్టేందుకు గతంలో నగరపాలక సంస్థ, రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించారు.

ప్రమాదపుటంచున 960 నివాసాలుకార్పొరేషన్, రెవెన్యూ అధికారుల జాయింట్ సర్వేలో నగర వ్యాప్తంగా సుమారు 860 ఇళ్లు ప్రమాదపు అంచున ఉన్నట్టు గుర్తించారు. సర్వే నిర్వహించి ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. కొండరాళ్లు పడి ఎవరైనా మరణిస్తే వారి కుటుంబసభ్యులను పరామర్శించి అంతో ఇంతో ఆర్థికసాయం చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప రిటైనింగ్ వాల్ నిర్మించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన రిటైనింగ్ వాల్ నిర్మించి తమను కాపాడాలని వారు కోరుతున్నారు.

కొండదిగిరాలేమంటున్న ప్రజలు వర్షాలు కురిసినప్పుడు ప్రమాదభరితంగా ఉన్న కొండప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలని వీఎంసీ అధికారులు ప్రచారం చేస్తున్నా అక్కడున్న ప్రజలు మాత్రం వెళ్లటంలేదు. దీంతో కొన్నిచోట్ల ప్రమాదం జరిగిన సందర్భాల్లో అధికారులు ఏం చేయలేని పరిస్థితి. రిటైనింగ్ వాల్ నిర్మించలేని కొండ ప్రాంత ప్రజలకు వీఎంసీ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లకేటాయించి తరలిపోవాలని చెబుతున్నా పట్టించుకోవడంలేదని అధికారులు చెబుతున్నారు.

## మద్యం ప్రియులకో గుడ్ న్యూస్.. ఇక రాత్రి 12 వరకూ..



అనంతపురం: ఆగస్టు 19(టుడే విదుర): కొత్త బార్ పాలసీ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. అనంతపురంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇతర అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం 2025-2028 సంవత్సరాలకు కొత్త బార్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆ మేరకు బార్ల లైసెన్సుల కోసం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అనంతపురం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 బార్లు, గుంతకల్లులో 3, తాడిపత్రిలో 4, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయని, సత్యసాయి జిల్లాలో హిందూపురంలో 3, ధర్మవరంలో 3, కదిరిలో 3, పెనుకొండ, మడకశిరలో ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. మొత్తం 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గతంలో బార్లను వేలం పద్ధతిలో కేటాయించే వారని, ప్రస్తుతం లాటరీ డ్రా విధానంలో కేటాయిస్తామని అన్నారు. 2022-25 బార్ పాలసీలో జనాభా స్లాబ్ మేరకు బార్లకు దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలు, రూ. 7.5 లక్షలు, రూ. 10 లక్షలు ఉండేదన్నారు. కొత్త విధానంలో దరఖాస్తు ఫీజు అన్నింటికి రూ. 5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ. 10వేలు నిర్ణయించారని తెలిపారు. పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరకాస్తులు రావాలన్న షరతును ప్రభుత్వం విధించిందన్నారు. 50 వేలలోపు జనాభా ఉన్న బార్లకు లైసెన్స్ ఫీజు రూ. 35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న బార్లకు రూ. 55 లక్షలు, 5 లక్షల పైబడిన జనాభా ఉన్న బార్లకు రూ. 75 లక్షల ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతంలో ఉన్న ఫీజులతో పోలిస్తే భారీగా తగ్గించారని అన్నారు. కొత్త బార్ల నిర్వహణ సమయాన్ని కూడా పెంచారన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ నడపవచ్చు అన్నారు. లైసెన్సు ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునని తెలిపారు. గతంలో ముందే రెస్టారెంట్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉండేదని, కొత్త విధానంలో లైసెన్సు వచ్చిన 15 రోజుల వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో వేయవచ్చు అన్నారు. దరఖాస్తులను రెండు జిల్లాల్లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. 28వ తేదీ లాటరీ డ్రా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


## బాలికల బాగోగులపై నిర్లక్ష్యం వద్దు

రాచర్ల, ఆగస్టు 19(టుడే విదుర): : బాలికల బాగోగుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా మలేరియా అధికారి ఎన్.మధుసూదన్‌రావు, గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ డీ జయ అన్నారు. స్థానిక మండల అధికారులతో కలిసి వారు రాచర్ల గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో 10వ తరగతి చదువుతున్న కె కరుణ అనారోగ్యానికి ఈనెల 16వ తేదీన కంభం ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న వారు పాఠశాలను సందర్శించి పాఠశాలలోని ఆర్వో ప్లాంట్, తరగతి గదులు, కిచెన్ రూం, లెట్రిన్, బాత్‌రూములు, పాఠశాల ఆవరణ, అన్నింటినీ పరిశీలించారు. ముఖ్యంగా పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. బాలికలకు చిన్న వ్యాధి ఉన్నట్లు గుర్తించినా వెంటనే వైద్యం



చేయించాలని, వైద్య సిబ్బంది పాఠశాలల్లో క్యాంపు నిర్వహించి అవసరమైన మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు షేక్ మొయినుద్దీన్, వీ గిరిధర్ శర్మ, వైద్యాధికారులు ఎస్.భానుకుమార్‌రెడ్డి, కే రమేష్, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వరి రైతు వెన్ను విరిచిన వర్షం



కోట/సూళ్లూరుపేట, ఆగస్టు 19(టుడే విదుర): మొన్నటి వరకు పంటను తడుపుకొనేందుకు వర్షం కోసం రైతులు ఎదురుచూశారు. వరి ఎన్ను దశకొచ్చిన ఈ సమయంలో ఆ వర్షమే రైతు వెన్ను విరిచింది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న తేలికపాటి జల్లులు, గాలితో వరి కోత దశలో ఉన్న వరిపైరు పూర్తిగా వాలిపోయింది. నీళ్లల్లో మొలకెత్తే దశకు చేరుకోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోట మండలంలోని గూడలి, దక్షిణపాలెం, రాజుపాళెం, తిన్నెపూడి, తాటితోపు, ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల్లో రైతులు వరి ఎడగారు సాగు చేపట్టారు. ఆయా పంటలు వెన్నుదశలో, కోత దశలో ఉండగా నేలపై వాలిపోయి కోత కోసేందుకు వీల్లేకుండా పోతోంది. సూళ్లూరుపేట మండలం మంగళంపాడు, మంగానెల్లూరు, కోటపోలూరు, సామంతమల్లాం, మన్నారుపోలూరు, ఇలుపూరు గ్రామాల్లోనూ కోత దశకు వచ్చిన వరిపైరు వర్షం ధాటికి నేలకొరిగింది.

## నదిని ఎవరూ దాటొద్దు

ఆత్మకూరు, ఆగస్టు 19(టుడే విదుర): భారీ వర్షాల నేపథ్యంలో ఆత్మకూరు పట్టణ శివార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నదిని తహసీల్దార్ రత్నరాధిక, అర్బన సీఐ రాము పరిశీలించారు. వరద ఉధృతి తగ్గేవరకు భవనాశి నదిని ఎవరూ దాటవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. కాగా భవనాశి ఉప్పొంగంతో ఆత్మ కూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వరద తగ్గుముఖం పట్టేవరకు ఆ రహదారిని ఎవ రినీ అనుమతించడం లేదు. ఇందుకోసం నదికి ఇరువైపులా పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అలాగే సిద్దాపురం చెరువులోకి కూడా భారీగా వరదనీరు వచ్చిచేరింది. దీంతో సిద్దాపురం చెరువును కూడా అధికారులు పరిశీలించారు. దీంతో కర్నూలు - గుంటూరు రహదారి పక్కనే ఉన్న అలుగు వద్ద నుంచి చెరువులో నీరు బయటకు వస్తుండటంతో ఆ నీటి వల్ల



కేజీరోడ్డున వెళ్లే వాహ నాలకు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ముందస్తు జాగ్ర త్తలతో వాహనాలు కొట్టుకునిపోయేందుకు వీలు లేకుండా కంచెను ఏర్పాటు చేస్తున్నారు. చెరువు పరిసర గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉం డాలని సూచించారు. కాగా సిద్దాపురం చెరువులో గరిష్టస్థాయిలో నీటి నిల్వలు వచ్చిచేరడంతో వద్ద టీడీపీ నాయకులు రవీంద్రబాబు, శివ ప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, వెన్నాశ్రీధర్‌రెడ్డి. స్వామిరెడ్డి. ఈశ్వర రెడ్డి తదితరులు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

## చిన్నారుల తిండిలో కక్కుర్తి..



శింగనమల(అమరావతి)ఆగస్టు 19(టుడే విదుర): పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలో ఐసీడీఎస్ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు కక్కుర్తికి పాల్పడ్డారని తెలుస్తోంది. శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చిన్నారులకు పంపిణీ చేసే బాలామృతం బ్యాగులు 484 మాయమయ్యాయి. ప్రాజెక్ట్‌కు బ్యాగులు వచ్చినా వాటిని చిన్నారులకు పంపిణీ చేయకుండా స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది వచ్చిన స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఉన్నతాధికారులు గుర్తించి విచారణ చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది రెండు వారాలుగా రోజు వచ్చి ఆన్‌లైన్‌లో సరిదిద్దడానికి కుస్తీ పడుతున్నట్లు సమాచారం. 2024 జనవరి నెలలో రావాల్సిన బాలామృతం 484 బ్యాగులు (ఒక్కో బ్యాగులో 8ప్యాకెట్లు చొప్పున 3872 ప్యాకెట్లు) మాయంపై విచారణ జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలలు నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులకు ప్రతినెలా 2.50 కిలోల పౌష్టికాహారం ప్యాకెట్ అందిస్తారు. %ఇక్కడ పనిచేసిన అధికారులు, బాలామృతం ఏజెన్సీ నిర్వాహకులు కుమ్మక్కై చిన్నారులకు పంపిణీ చేయకుండా స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు సరఫరా చేసినట్లు ఎఫ్‌టీఆర్ ఇచ్చారు.

# బాత్‌రూమ్ కిటికీలో నుంచి దొంగ పరార్..




హైదరాబాద్:ఆగస్టు 19(టుడే విదుర): ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఏదో ఒక పథకం పన్ని ఖైదీ తప్పించుకుపోవడం మనం సినిమాల్లో చూస్తుంటాం. పోలీసులను మాటల్లో పెట్టి.. పోలీసులను మాయ చేసి ఖైదీలు తప్పించుకుంటారు. అదే సినిమా లైవ్ ఇన్సిడెంట్ నగరంలో రిపీట్ అయ్యింది. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన ఓ ఖైదీ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నాడు.గాంధీ ఆసుపత్రికి సోహేల్ అనే ఖైదీని రిమాండ్‌కు తరలించే ముందు వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు తీసుకొచ్చారు. అయితే సోహేల్ చాకచక్యంగా.. బాత్‌రూమ్ వస్తుందని చెప్పి బాత్‌రూమ్‌లోకి ప్రవేశించాడు. బాత్‌రూమ్‌లో కిటికీ తొలగించడానికి అదునుగా ఉండటం గమనించి కిటికీ తొలగించి అందులో నుంచి పరారయ్యాడు. సోహేల్ ఎంతకు బాత్‌రూమ్ నుంచి రాకపోయే సరికి పోలీసులు బాత్‌రూమ్ డోర్ ఓపెన్ చేసి చూడగా.. కంగుతిన్నారు. దొంగతనం కేసులో సోహేల్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోహేల్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# పండగలకు భారీ బందోబస్తు..



హైదరాబాద్ సిటీఆగస్టు 19(టుడే విదుర): వినాయక చవితి, మిలాద్ ఉల్ నబీపండగల సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అధికారులను ఆదేశించారు. కమిషనర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసే గణేశ్ మండపాల వద్ద భద్రత, బందోబస్తు, ఏర్పాట్లపై సమీక్షించారు.గణేష్ ఉత్సవాల సమయంలోనే మిలాద్ ఉన్ నబీ పండగ వస్తుందని, ఈ సమయంలో నిర్వహించే ర్యాలీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేశ్ మండపాల వద్ద విద్యుత్ వంటి ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కోరారు.

# శంషాబాద్‌లో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్..

## విమానంలో 67 మంది ప్రయాణికులు




ఆగస్టు 19(టుడే విదుర): విమానా ప్రమాదాలు, విమానం సాంకేతిక లోపాలతో వెనుతిరగడం వంటి వార్తలు ఒకప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారేవి. కానీ ఇప్పుడు అలా కాదు.. రోజుకో విమాన ప్రమాద ఘటన చూస్తూ.. అది ఒక సాధారణ వార్తగా మారిపోయింది. ప్రపంచంలో ఎక్కడో ఓ చోట ఏదో ఒక విమానం ప్రమాదానికి గురవుతునే ఉంది. ఇన్ని ప్రమాదాలు, సాంకేతిక లోపాలు విమానాల్లో బయటపడుతున్న విమానాలకు సంబంధించిన కంపెనీలు మాత్రం ఏ మాత్రం చలించడం లేదు. ప్రజల ప్రాణాలు లెక్క లేనట్టు వ్యవహరిస్తూ.. కార్పొరేట్ బుద్ధిని చూపిస్తున్నాయి.అయితే తాజాగా.. ఓ విమానంలో సాంకేతిక లోపం చోటుచేసుకున్న ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగింది. హైదరాబాద్ – తిరుపతి బయలుదేరిన అలయన్స్ ఎయిర్ లైన్స్ విమానంలో టేకాఫ్ తర్వాత పైలెట్ సాంకేతిక లోపం గుర్తించారు. దీంతో తిరిగి వెంటనే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. టేకాఫ్ సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులను దింపి సాంకేతిక లోపాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతి వెళ్లాల్సిన 67 మంది ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పడిగాపులు కాస్తున్నారు. పైలెట్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# దంచికొడుతున్నవర్షాలు..

## హైదరాబాద్ అస్తవ్యస్తం..




హైదరాబాద్:ఆగస్టు 19(టుడే విదుర): తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. రాత్రి, పగలు అని తేడా లేకుండా.. వరుణుడు కుంభవర్షం కురిపిస్తున్నాడు. ఈ మేరకు పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. వర్షాల దృష్ట్యా అధికారులు పలు జిల్లాల్లోని స్కూళ్లకు సెలవులు సైతం ప్రకటించారు. చాలా జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో వరద ముప్పు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

అయితే.. భారీ వర్షాల దాటికి హైదరాబాద్ నగరం అస్తవ్యస్తం అవుతోంది. రాత్రి కురిసిన వర్షానికి నగరమంతా జలమయం అయిపోయింది. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ నీటితో మునిగిపోయాయి. నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు జనసంచారం స్థంబించిపోయింది. పలు కాలనీలు పూర్తిగా జలమయం అవ్వడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నాలాలు పొంగిపొర్లుతున్నాయి. డ్రైనేజీ నీరు రోడ్లపై వరదలా ప్రవహిస్తోంది. వర్షాల దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఈ వర్షాలు ఇంకా మూడ్రోజులపాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. దూరం ప్రయాణం చేసే వారు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఇప్పటికే.. జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. నగరంలో నిలిచిపోయిన నీటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా.. భద్రాద్రి, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, హన్మకొండ, కామారెడ్డి, ఖమ్మం, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు(గాలి వేగం గంటకు 30-40 కి.మీ వేగంతో)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో ఐటీ సోదాలు..




హైదరాబాద్:ఆగస్టు 19(టుడే విదుర): తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా ఐటీ అధికారులు తమదైనా తీరు ప్రదర్శిస్తున్నారు. రాజకీయ నాయకులు, బడా వ్యాపారస్థులు, సినిమా పెద్దలు అని తేడా లేకుండా సోదాలు నిర్వహిస్తూ.. దూకుడు కొనసాగిస్తున్నారు. తాజాగా మరోసారి ఐటీ అధికారులు నగరంలో వారి పంజా విసిరారు. గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో ఐటీ సోదాలు చేస్తున్నారు. కంపెనీ టాక్స్ చెల్లింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు సమాచారం రావడంతో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో పాటు కంపెనీ డైరెక్టర్స్ ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఐటీ అధికారులు పేర్కొన్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఏకకాలంలో 10 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడిచిన 5 ఏళ్ల పన్నుల చెల్లింపులపై కంపెనీ యాజమాన్యాన్ని ఆరా తీస్తున్నారు అధికారులు. జూబ్లీహిల్స్ , బంజారాహిల్స్ , నగర్ , సురారంలో సోదాలు కొనసాగుతున్నాయి.బలగాల మధ్య సోదాలు జరుపుతున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. అయితే తెలంగాణతో పాటు గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి సంబంధించి ఏపీ, కర్ణాటకలో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏకకాలంలో 30 చోట్ల సోదాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# 12 ఏళ్ల బాలిక దారుణ హత్య

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 19(టుడే విదుర): కూకట్‌పల్లిలో 12 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో ఇంట్లో చిన్నారి ఒక్కత్తే ఉండటం, మధ్యాహ్నం తండ్రి వచ్చి చూసేసరికే బాలిక రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉండటంతో ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసింది. గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి బాలికను కత్తితో పొడిచి చంపాడని భావిస్తున్నారు.హతురాలు.. కృష్ణ, రేణుక దంపతుల కుమార్తె సహస్ర (12). ఈ దంపతులకు సహస్రతో పాటు ఓ బాబు ఉన్నాడు. ఐదేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మక్తక్యాసారం నుంచి బతుకుదెరువు కోసం కూకట్‌పల్లికి వచ్చి ఉంటున్నారు. కృష్ణ బల్కంపేటలో ఓ బైక్ రిపేర్ షాపు నిర్వహిస్తున్నాడు. రేణుక కూకట్‌పల్లిలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తోంది. కూతురు సహస్ర కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతుంటే.. కుమారుడు ఇంటికి సమీపంలోనే ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నాడు. ఉదయం 9 గంటలకు కృష్ణ, రేణుక పనులకు, బాబు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో సహస్ర ఒక్కత్తే ఉంది. మధ్యాహ్నం 12:30కు కుమారుడికి లంచ్ బాక్స్ తీసుకెళ్లేందుకు కృష్ణ ఇంటికి వెళ్లాడు. ఒంటికి తీవ్రగాయాలైన స్థితిలో కూతురు మృతదేహాన్ని చూసి షాక్‌తో బిగ్గరగా రోదించాడు.ఫోన్ చేసి భార్యకు ఘోరం గురించి చెబుతుంటే.. ఆమెకు భర్త మాట్లాడుతోంది గానీ, ఎందుకు రోదిస్తున్నాడని గానీ అర్థం కాకపోవడంతో పక్కవాళ్లకు ఫోన్ చేస్తే జరిగిన ఘోరం గురించి తెలిసింది. డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో కేవీ సుబ్బారావు ఘటనాస్థలికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రంగంలోకి దిగి వివరాలు సేకరించారు. తమకు ఎవ్వరిపైనా అనుమానాలు లేవని పోలీసులకు బాధిత తల్లిదండ్రులు చెప్పారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. బాలికతో సన్నిహితంగా ఉండే స్నేహితుల గురించి ఆరా తీస్తున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలిక కుటుంబసభ్యులను పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పోక్సో నిందితుడికి

## 20 ఏళ్ల జైలు శిక్ష



దుబ్బాక,ఆగస్టు 19(టుడే విదుర): అత్యాచారం, పోక్సో కేసులో నిందితుడికి సిద్దిపేట జిల్లా ఫస్టుక్లాస్ అదనపు సెషన్స్ కోర్టు 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించింది. అక్బర్‌పేట– భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామానికి చెందిన పర్స శ్రీనివాస్ (48) 2022 ఏప్రిల్ 16న రాత్రి బహిర్భుమికి వెళ్లిన ఓ 14 ఏళ్ల బాలికను నిర్బంధించాడు. అంతేగాక అరవకుండా చున్నీని నోట్లో కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బాలిక తన తల్లికి తెలియజేయగా ఆమె అదే నెల 18న భూంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి జయప్రసాద్ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా చర్యలు తీసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై హరికృష్ణను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

# టుడే వినోదం

## అందమైన ప్రేమ కథ.. విడుదల ఎప్పుడంటే




రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ )జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించిన చిత్రం 'శశివదనే' . గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్‌వీఎస్ స్టూడియోస్ బ్యానర్ల మీద అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల నిర్మించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఫీల్ గుడ్ వింటేజ్ విలేజ్ లవ్ స్టోరీగా తెరకెక్కించిన ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్లు సోమవారం నాడు ప్రకటించారు. దసరా సీజన్‌లో అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నట్టుగా నిర్మాతలు ప్రకటించారు.%సాయి కుమార్ దారా అందించిన విజువల్స్, శరవణ వాసుదేవన్ ఇచ్చిన సంగీతం ప్రధాన ఆకర్షణ కానున్నాయని దర్శకుడు చెప్పారు. ఓ అందమైన ప్రేమ కథా చిత్రానికి విజువల్స్, మ్యూజిక్ ఎంత ప్రాముఖ్యం అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 'శశివదనే' మూవీని మేకర్స్ ఓ దృశ్యకావ్యంగా మలిచారు. ఈ సినిమాకు అనుదీప్ దేవ్ అందించిన నేపథ్య సంగీతం మేజర్ అస్సెట్ కానుందని నిర్మాతలు అన్నారు. రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన ఈ చిత్రంలో శ్రీమాన్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ తదితరులు నటించారు. ఈ మూవీకి ఎడిటర్‌గా గ్యారీ బీహెచ్, కాస్ట్యూమ్ డిజైనర్‌గా గౌరీ నాయుడు, కొరియోగ్రాఫర్‌గా జేడీ మాస్టర్ పని చేశారు.

## నా కెరీర్‌లో గొప్ప సినిమా




సుహాస్, శివానీ నగరం హీరో హీరోయిన్లుగా నూతన దర్శకుడు గోపీ అచ్చర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'హే భగవాన్' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బేనర్‌పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. సుహాస్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ వీకే మాట్లాడుతూ 'ఈ సినిమా నా కెరీర్‌లో మరచిపోలేని గొప్ప సినిమా అవుతుంది. కథ విన్నప్పుడు పగలబడి నవ్వాను. చాలా కొత్త బ్యాక్‌డ్రాప్ తీసుకున్నారు' అని అన్నారు. సుహాస్ మాట్లాడుతూ 'ప్రశాంత్ ఈ సినిమాకి అద్భుతమైన కథ ఇచ్చాడు. కచ్చితంగా మంచి హిట్ కొడతాం.నరేశ్ గారితో పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. హీరోయిన్ శివాని మాట్లాడుతూ 'ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు గోపీ అచ్చర్ల మాట్లాడుతూ 'ఈ చిత్రంలో తండ్రి కొడుకుల ఎమోషన్ హృదయాలకు హత్తుకుంటుంది' అని అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ 'సుహాస్ సినీ ప్రయాణం చాలా స్ఫూర్తివంతంగా ఉంటుంది' అని అన్నారు.

## వరుసగా పరాజయాలే...




కియారా అద్వానీ . హిందీలోనే కాదు తెలుగులోనూ సినిమాలు చేస్తూ తన సత్తా చాటుతోంది. ఈ యేడాది 'టాక్సిక్' మూవీతో శాండిల్ ఉడ్ లోకి కూడా అడుగుపెడుతోంది. కేవలం గ్లామర్ డాల్ గా కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేస్తున్న కియారా అద్వానీ కెరీర్ లో 'వార్ –2'కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాలో కియారా అద్భుతమైన యాక్షన్ సీన్స్ చేసింది. అయితే వాటి గురించి కాకుండా కేవలం ఆమె ధరించిన బికినీ గురించి మాత్రమే సోషల్ మీడియాలో అత్యధికంగా చర్చ జరిగింది. అయితే ఈ సినిమా పరాజయం పాలు కావడంతో కియారా అద్వానీ ఖాతాలో వరుసగా ఐదు చిత్రం చేరినట్టు అయ్యింది. కియారా అద్వానీ కెరీర్ మొదలై పదకొండు సంవత్సరాలు అవుతోంది. యేడాది రెండు, మూడు సినిమాల్లో నటిస్తోంది. తెలుగులోనూ 'భరత్ అనే నేను', 'వినయ విధేయ రామ' చిత్రాలలో నటించింది. తాజాగా ఈ యేడాది ఆమె నటించిన 'గేమ్ ఛేంజర్' కూడా విడుదలైంది. చివరి రెండు సినిమాలు పరాజయం పాలయ్యాయి. అయితే... 2022లో వచ్చిన 'భోల్ భులయ్యా –2' తర్వాత కియారా అద్వానీకి చెప్పుకోదగ్గ సక్సెస్ దక్కలేదు. అదే యేడాది వచ్చిన 'జుగ్ జుగ్ జియో' 'గోవింద నామ్ మేరా' సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇక 2023లో వచ్చిన 'సత్యప్రేమ్ కి కథ' కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. 2024లో అయితే కియారా నటించిన ఒక్క సినిమా కూడా విడుదల కాలేదుఈ యేడాది ఇప్పటికే 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ కాగా... తాజాగా 'వార్ 2' కూడా అదే ఖాతాలో చేరింది. దాంతో కియారా వరుసగా ఐదు ఫ్లాప్స్ అందుకుని డబుల్ హ్యాట్రిక్ కు చేరువైందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. మరి త్వరలో విడుదల కానున్న యశ్ మూవీ 'టాక్సిక్'అయినా విజయం సాధించి, ఈ అందాల ముద్దుగుమ్మను సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందేమో చూడాలి. కియారా అద్వానీ జీవితంలో ఈ మధ్య కాలంలో జరిగిన ఆనందకర సంఘటన ఏదైనా ఉందంటే జూలై 15న ఆమె అందాల బిడ్డకు జన్మనివ్వడమే!

## షూటింగ్‌లు ఆపడం అన్యాయం..




తెలుగు చిత్ర పరిశ్రమలో గత రెండు వారాలుగా చిత్రీకరణలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. సినీ కార్మికులు వేతనాలు పెంచాలంటూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బంద్ జరుగుతోంది. ఇప్పటి సినీ పెద్దలతో, ఛాంబర్‌తో పలు చర్చలు జరిగినా ఇంకా సమస్యకు పరిష్కారం దొరకలేదు. మంగళవారం కృష్ణానగర్‌లో ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడారు. 'కార్మికుల వేతనాలు పెంచాలని అందరికీ తెలుసు. కానీ ఏదో ఒక వంకతో 16 రోజులుగా ఆలస్యం చేస్తున్నారు. ఒక్కరోజు పని లేకపోయినా బతకలేని వారు 50 శాతం మంది పరిశ్రమలో ఉన్నారు. వారి గురించి కాస్త అయినా ఆలోచించాలి కదా? ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు పది రోజులు పని దొరకడం లేదు.%సినీ కార్మికులకు సాఫ్ట్‌వేర్ కన్నా ఎక్కువ సంపాదన వస్తుందని కొందరు అంటున్నారు. నెలలో 30 రోజులూ పని ఉంటేనే అది సాధ్యం. నెలలో 30 రోజులు పని ఇస్తే జీతాలు పెంచాల్సిన అవసరం లేదు. 15 రోజులుగా షూటింగ్ పనులు ఆపడం అన్యాయం. నిర్మాతలు షూటింగ్‌లు ఆపుతున్నారు ఈ పద్ధతి ఎక్కడా లేదు.



## ఎన్టీఆర్ పెద్ద కోడలు మృతి..




నందమూరి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు పెద్ద కోడలు, జయకృష్ణ సతీమణి పద్మజ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆమె వయసు 73 సంవత్సరాలు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురుకావడంతో తెల్లవారుజామున ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.%పద్మజ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు స్వయాన చెల్లెలు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఢిల్లీ నుండి దగ్గుబాటి పురందేశ్వరి ఈరోజు మధ్యాహ్నానికి హైద్రాబాద్ కి చేరుకోనున్నారు. పద్మజ మరణంతో నందమూరి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

## యానిమేటెడ్ డార్క్ ఫాంటసీ థ్రిల్లర్




జపాన్ లో తెరకెక్కిన యానిమేటెడ్ డార్క్ ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ 'డీమన్ స్లేయర్: కిమెట్సు నో యైబా ఇన్ఫినిటీ క్యాసిల్' . హరుఓ సోటోజాకి డైరెక్ట్ చేసిన ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా ఇపుడు తెలుగులోనూ రానుంది. తాజాగా తమిళ, తెలుగు ట్రైలర్లను మేకర్స్ విడుదల చేశారు. ఈ ఎపిక్ ట్రైలజీ యొక్క ఫస్ట్ పార్ట్ ని భారతదేశంలో సెప్టెంబర్ 12న విడుదల అవుతుంది. మనుషులు, రాక్షసుల మధ్య జరిగే విషాదగాథ ఇది. కత్తి యుద్ధాలు, ఆకట్టుకునే కారక్టర్స్, కామెడీ సీన్స్ తో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తుందినే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. సినిమా మొత్తం మూడు భాగాలుగా రానుంది ఈ చిత్రాన్ని జపాన్, కొన్ని ఆసియా దేశాల్లో తప్ప, ప్రపంచవ్యాప్తంగా క్రంచిరోల్ మరియు సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు రిలీజ్ చేయనున్నారు. ప్రీమియం లార్జ్ ఫార్మాట్‌లలో కూడా రిలీజ్ కాబోతుంది.




# క్రీడావార్తలు




## ఈసీ సభ్యుడిగా ఒకసారి సరిపోతుంది!



న్యూఢిల్లీ: జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ చేయాలంటే..గతంలో ఆయా సమాఖ్యల ఎగ్జిక్యూటివ్ కమిటీలలో రెండుసార్లు సభ్యుడిగా ఉండాల్సి వచ్చేది. కానీ పార్లమెంట్ ఆమోదించిన నూతన జాతీయ క్రీడా పరిపాలన బిల్లు ప్రకారం ఒక్కసారి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తే చాలు. యువ క్రీడా పరిపాలకులు, నాయకత్వ లక్షణాలు కలిగిన అథ్లెట్లను ప్రోత్సహించేందుకే 'రెండు టర్మ్'లను ఒకటికి కుదించినట్టు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య వెల్లడించారు. జాతీయ క్రీడా పరిపాలన బిల్లును ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. రాష్ట్రపతి సంతకం చేశాక 'కొత్త బిల్లు' చట్టంగా మారనుంది.

## ఆసియా షూటింగ్‌లో భారత్‌కు రజతం

షిమ్కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప పిస్టల్ విభాగంలో భారత పురుషుల జట్టు రజత పతకంతో బోణీ చేసింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో అన్మోల్, అదిత్య, సౌరభ్ చౌధరితో కూడిన భారత త్రయం రెండోస్థానంతో రజతం అందుకుంది. చైనా స్వర్ణం, ఇరాన్ కాంస్యం నెగ్గాయి. ఇక, జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కపిల్ స్వర్ణం, గవిన్ కాంస్యం అందుకున్నారు. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం దక్కించుకుంది.




## అథ్లెట్ షీనాపై నిషేధం



న్యూఢిల్లీ: భారత ట్రిపుల్ జంపర్ షీనా వర్కేపై జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నిషేధం విధించింది. కేరళకు చెందిన ఈ 32 ఏళ్ల అథ్లెట్ డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలింది. 2023 ఆసియాగేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించిన షీనా.. ఇటీవలి జాతీయ క్రీడల్లో రజతం, ఫెడరేషన్ కప్‌లో కాంస్యం గెలుచుకుంది.

## షూటర్ శ్రీధర్ డబుల్ ధమాకా

): పుణెలో జరిగిన జాతీయ పారా ఓపెన్ షూటింగ్ చాంపియన్‌షిపలో కాకినాడ షూటర్ శ్రీధర్ రాయల రెండు పతకాలు కొల్లగొట్టాడు. 50 మీటర్ల రైఫిల్–ఆర్ 9 విభాగంలో స్వర్ణం నెగ్గిన శ్రీధర్.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్–ఆర్5 కేటగిరీలో కాంస్యం సాధించాడు. ఖమ్మం షూటర్ పావని.. ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల–ఆర్4 విభాగంలో రజతం నెగ్గింది.




## హెచ్‌సీఏ తాత్కాలిక చీఫ్ దల్జీత్‌పై సీఐడీకి ఫిర్యాదు




హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తాత్కాలిక అధ్యక్షుడు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్‌పై సీఐడీ చీఫ్ చారు సిన్హాకు ఆ సంఘం మాజీ కార్యవర్గ సభ్యుడు చిట్టి శ్రీధర్ ఫిర్యాదు చేశాడు. అమీర్‌పేట సీసీ, ఖాల్సా సీసీ అనే రెండు క్లబ్‌ల తరఫున దల్జిత్ 2018లో సంతకాలు చేసి చెక్‌లు ఇచ్చి, వార్షిక రెన్యువల్ ఫీజును చెల్లించాడని, ఇది మల్టిపుల్ క్లబ్‌ల కిందకు వస్తుందని శ్రీధర్ ఆరోపించాడు. లోథా నిబంధనల ప్రకారం ఒక సభ్యుడు ఒక క్లబ్‌లోనే ఉండాలని, తాత్కాలిక అధ్యక్షుడిగా అతడికి కొనసాగే హక్కు లేదని, తక్షణమే దల్జీత్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఇదే ఫిర్యాదును హెచ్‌సీఏ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రిటైర్డ్ జస్టిస్ నవీన్‌రావు, అంబుడ్స్‌మన్‌కు కూడా ఈమెయిల్‌ద్వారా పంపించానని తెలిపారు. బసవరాజు అమీర్‌పేట క్లబ్ నుంచి హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి నిబంధనలను ఉల్లంఘించారని, అలాగే సునీల్ అగర్వాల్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా ఉంటూ అతడి కుమారుడు హెచ్‌సీఏ తరఫున ఆడడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని శ్రీధర్ అన్నాడు.

## ఆటే ముఖ్యమని.. ప్రధానిని కూడా కలవలేదు




న్యూఢిల్లీ: మ్యాచ్‌కు ముందు ఓ దేశ ప్రధాని ఆటగాళ్లను కలుసుకునేందుకు వస్తే.. ఎవరైనా ఉద్వేగంతో ఎదురుచూస్తారు. కానీ భారత బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం తనకు ఆటే ముఖ్యమంటూ మైదానంలోకి వెళ్లాడట. ఈ విషయాన్ని సన్నీ సహచరుడు, మాజీ పేసర్ కర్సన్ ఘావ్రీ వెల్లడించాడు. "ఢిల్లీలో ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్‌కు ముందు అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆటగాళ్లను కలుస్తారని సమాచారం వచ్చింది. కానీ ఆయన రావడం ఆలస్యం కాగా అప్పటికే టాస్ పూర్తయి భారత్ బ్యాటింగ్ చేసేందుకు సిద్ధమైంది.గవాస్కర్ ప్యాడ్లు కట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. అప్పుడే డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చిన రాజ్‌సింగ్ దుంగార్పూర్ 'ప్రధాని వచ్చారు. మీరందరూ రండి. మూడు నిమిషాల్లో వచ్చేద్దాం' అని చెప్పాడు. అయితే సన్నీ మాత్రం 'మీరెళ్లండి.. నాకు నా బ్యాటింగ్, టీమ్ ముఖ్యం' అని అన్నాడు. బరిలోకి దిగి టీ బ్రేక్ వరకు ఆడాడు. అయితే ఆ రోజు ఆట చివర్లో ప్రధాని స్వయంగా గవాస్కర్‌ను కలుసుకునేందుకు మరోసారి రావడం విశేషం' అని ఘావ్రీ వివరించాడు.

## ఇక.. ఆర్చరీ లీగ్



న్యూఢిల్లీ: ప్రధాన క్రీడల్లో మాదిరే ఆర్చరీలోనూ 'ఫ్రాంచైజీ' అడుగుపెట్టింది. మొట్టమొదటి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) అక్టోబరులో జరగనుంది. ఆరు జట్లు ఇందులో తలపడుతున్నట్టు జాతీయ ఆర్చరీ సంఘం (ఏఏఐ) సోమవారం వెల్లడించింది. జ్యోతి సురేఖ, దీపికా కుమారి, ధీరజ్ బొమ్మదేవర, అభిషేక్ వర్మలాంటి స్టార్లు ఏపీఎల్ బరిలో దిగనున్నారు. సురేఖ, ధీరజ్ సహా మరో ముగ్గురు తెలుగు ఆర్చర్లు చికితా రావు, జిగ్నేష్, హంస కూడా లీగ్‌లో పోటీపడతారు. ఫ్రాంచైజీల పేర్లను ఖరారు చేయాల్సి ఉంది. తొలి సీజన్‌కు వేలంలో కాకుండా డ్రాఫ్ట్ విధానంలో ఆర్చర్లను జట్లు ఎంపిక చేసుకోనున్నాయి. ఒక్కో జట్టులో 8 మంది ఆర్చర్లుంటారు. ఇందులో నలుగురు పురుషులు, నలుగురు మహిళా ఆర్చర్లుంటారు. ప్రతి జట్టు ఇద్దరు విదేశీ ఆర్చర్లను చేర్చుకోవచ్చు.

## గిల్‌కు చోటు దక్కేనా?



న్యూఢిల్లీ: వచ్చేనెలలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీ కోసం మంగళవారం భారత జట్టును ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు బెర్త్ దక్కుతుందా? లేదా? అనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీసలో పరుగుల వరద పారించిన గిల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అలాగే ఐపీఎల్‌లోనూ రాణించాడు. అయితే గిల్‌ను ఎవరి స్థానంలో భర్తీ చేయాలనేదే సెలెక్టర్లకు ఇప్పుడు సమస్యగా మారింది. కొంతకాలంగా టాప్–3లో అభిషేక్, శాంసన్, తిలక్ మెరుగ్గానే రాణిస్తున్నారు. ఇప్పుడు వారికి పోటీగా జైస్వాల్, గిల్, సుదర్శన్ సిద్ధంగా ఉన్నారు. కానీ వీరు లేకుండానే సూర్యకుమార్ నేతృత్వంలోని టీ20 జట్టు చివరి 20 మ్యాచ్‌ల్లో 17 విజయాలతో అదరగొట్టింది.ఒకవేళ 15 మందితో కూడిన భారత జట్టులో గిల్‌కు చోటిస్తే అతడిని కచ్చితంగా బరిలోకి దింపాల్సి ఉంటుంది. అదే జరిగితే శాంసన్, అభిషేక్, తిలక్‌లలో ఒకరు తమ స్లాట్‌ను త్యాగం చేయాల్సిందే. అటు గిల్ కోసం రింకూ సింగ్‌పై వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్ చోటుపైనా సస్పెన్స్ కొనసాగుతోంది. బౌలింగ్ విభాగంలో పేసర్ బుమ్రా అందుబాటులో ఉంటాడని సమాచారం. అతడికి జతగా అర్ష్‌దీప్, హార్దిక్ ఉంటారు. హర్షిత్ రిజర్వ్ పేసర్. ప్రసిద్ధ్, సిరాజ్‌లను సెలెక్టర్లు టెస్టు పేసర్లుగానే పరిగణిస్తున్నారు కాబట్టి అక్టోబరులో వెస్టిండీసతో టెస్టు సిరీసకు వీరిద్దరు తాజాగా బరిలోకి దిగవచ్చు. స్పిన్నర్లుగా అక్షర్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి మొదటి ప్రాధాన్యంలో ఉన్నారు. అయితే ఆల్‌రౌండర్ కావాలనుకుంటే వాషింగ్టన్ సుందర్‌ను తీసుకున్నా ఆశ్చర్యం లేదు. రెండో సీమ్ ఆల్‌రౌండర్‌గా శివమ్ దూబేతో పాటు రిజర్వ్ కీపర్‌గా జితేశ్, జురెల్‌ల మధ్య పోటీ నెలకొంది.

## లండన్ వీధుల్లో విరుష్క జోడీ.. స్థానికులతో ఎలా మాట్లాడుతున్నారో చూడండి..




టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కుటుంబంతో కలిసి లండనలో స్థిరపడిన సంగతి తెలిసిందే. కేవలం క్రికెట్ ఆడుతున్నప్పుడు మాత్రమే కోహ్లీ ఇండియాకు వస్తున్నాడు. కోహ్లీ పిల్లలు, భార్య అనుష్క మాత్రం లండన్‌లోనే ఉంటున్నారు. ఐపీఎల్) తర్వాత క్రికెట్ మ్యాచ్‌లు లేకపోవడంతో కోహ్లీ లండన్‌లోనే ఉంటున్నాడు. అక్కడే క్రికెట్ ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడు. తాజాగా కోహ్లీ తన భార్య అనుష్క శర్మతో కలిసి లండన్ వీధుల్లో చక్కర్లు కొడుతూ కనిపించాడు.స్టార్‌డమ్‌తో సంబంధం లేకుండా సామాన్యుడిలా జీవించడం కోసమే కోహ్లీ లండన్‌కు తన మకాం మార్చాడు. తను కోరుకున్నట్టుగానే అక్కడ జీవిస్తున్నాడు. కోహ్లీ తన భార్య అనుష్కతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

# గుడ్‌న్యూస్.. స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు




ఇంటర్నెట్ డెస్క్: పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలు కల్పిస్తూ బంగారం ధర గత కొన్ని రోజులుగా తగ్గుతూనే ఉంది. నిన్నటితో పోలిస్తే నేడు కూడా బంగారం ధరలు మళ్లీ స్వల్పంగా తగ్గాయి. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,01,160గా ఉంది. వెండి ధర మాత్రం స్వల్పంగా పెరిగి రూ.1,17,000కు చేరుకుంది. ఇక 10 గ్రాముల ప్లాటినం ధర రూ.37,850గా ఉంది.

## టుడే బిజినెస్

# విస్తరణ బాటలో మోంట్రా ఎలక్ట్రిక్




మురుగప్పా గ్రూప్‌నకు చెందిన క్లీన్ మొబిలిటీ సంస్థ మోంట్రా ఎలక్ట్రిక్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా సోమవారం నాడిక్కడ ఎలక్ట్రిక్ స్మాల్ కమర్షియల్ వెహికల్ (ఈ-ఎసీవీ) కోసం ప్రత్యేక డీలర్‌షిపను ప్రారంభించింది. శ్రీరామ్ హర్ష భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఈ డీలర్‌షిప్ కేంద్రాన్ని టీఐ క్లీన్ మొబిలిటీ (మోంట్రా ఎలక్ట్రిక్) చైర్మన్ అరుణ్ మురుగప్పన్, ఎండీ జలజ్ గుప్తా, హర్ష గ్రూప్ చైర్మన్ హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జలజ్ గుప్తా మాట్లాడుతూ.. వాణిజ్య ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) మార్కెట్లలో హైదరాబాద్ కీలకంగా ఉండటమే కాకుండా లాజిస్టిక్ హబ్‌గా ఎదుగుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించామని, ఈ షోరూమ్‌లో మోంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్ శ్రేణి వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. కాగా విస్తరణలో భాగంగా రానున్న రోజుల్లో హర్ష గ్రూప్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంలలో డీలర్‌షిపలను ఏర్పాటు చేయనున్నట్లు గుప్తా చెప్పారు.

# హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో జింజర్ హోటల్



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ హోటల్స్ సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీఎల్) తన జింజర్ హోటల్స్ ను హైదరాబాద్ జినోమ్ వ్యాలీకి విస్తరిస్తోంది. ఇందులో భాగంగా జినోమ్ వ్యాలీలో 'జింజర్ జినోమ్ వ్యాలీ' పేరుతో ఒక స్టార్ హోటల్ నిర్మిస్తోంది. మాడిసన్ గ్రూప్‌తో కలిసి ఐహెచ్‌సీఎల్ ఈ 75 గదుల హోటల్ నిర్మించనుంది. జినోమ్ వ్యాలీ ప్రాంత వ్యాపార, సామాజిక కార్యక్రమాల కు ఈ హోటల్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# మార్కెట్‌కు జీఎస్‌టీ జోష్





ముంబై: జీఎస్‌టీ రేట్లు తగ్గించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ప్రకటించడంతోపాటు ఎస్ అండ్ పీ 18 ఏళ్ల తర్వాత భారత పరపతి రేటింగ్‌ను పెంచడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో భారీ ఉత్సాహాన్ని నింపింది. జీఎసటీ రేట్ల తగ్గుదలతో భారీగా లబ్ధి పొందనున్న వాహనం, వినియోగ రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు పోటెత్తించడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ఉవ్వెత్తున ఎగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,168.11 పాయింట్లు పెరిగి 81,765.77 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కాస్త తగ్గిన సూచీ చివరకు 676.09 పాయింట్ల లాభంతో 81,273.75 వద్ద ముగిసింది.నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 390 పాయింట్లు పెరిగి 25,000 స్థాయిని అధిగమించినప్పటికీ, చివరికి 245.65 పాయింట్ల వృద్ధితో 24,876.95 వద్ద స్థిరపడింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎసఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.71 లక్షల కోట్లు పెరిగి రూ.450.96 లక్షల కోట్లకు చేరుకుంది.సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 రాణించాయి. మారుతి సుజుకీ షేరు ఏకంగా 8.94 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ 5.02 శాతం వృద్ధి చెందగా.. అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎం అండ్ ఎం, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు 3 శాతానికి పైగా పుంజుకున్నాయి. కాగా, ఐటీసీ 1.26 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఐటీ రంగ షేర్లూ నష్టాల్లో పయనించాయి.బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన స్మాల్‌క్యాప్ 1.39 శాతం, మిడ్‌క్యాప్ ఒక శాతం వృద్ధి చెందాయి. రంగాల వారీ సూచీల్లో ఆటో ఏకంగా 4.26 శాతం ఎగబాకింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.08 శాతం, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ 2.74 శాతం, రియల్టీ 2.19 శాతం లాభపడ్డాయి. కమోడిటీస్, మెటల్, సర్వీసెస్ ఇండెక్స్‌లు 1.96 శాతం వరకు పెరిగాయి. ఐటీ, పవర్, టెక్, ఫోకస్డ్ ఐటీ సూచీలు మాత్రం నష్టాల్లో ముగిశాయి.ఎస్ఈలో మొత్తం 4,365 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,499 లాభపడ్డాయి. 1,696 నష్టపోగా.. 170 యథాతథంగా ముగిశాయి. 156 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.

# రద్దయిన పాలసీల పునరుద్ధరణ





న్యూఢిల్లీ: ఏవైనా కారణాలతో ప్రీమియం చెల్లించలేక మధ్యలోనే రద్దయిన పాలసీల పునరుద్ధరణకు భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) గడువు ఇచ్చింది. ఇందుకోసం ఈ నెల 18 నుంచి అక్టోబరు 17 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతోంది. పాలసీ షరతులకు లోబడి ఇంకా పాలసీ గడువు ఉండి, ప్రీమియం చెల్లింపులు ఆపేసిన ఐదేళ్ల లోపు పాలసీలకు మాత్రమే ఈ పునరుద్ధరణ వర్తిస్తుంది. ఇందుకోసం చెల్లించాల్సిన లేటు ఫీజుల్లోనూ రూ.5,000 పరిమితికి లోబడి 30 శాతం వరకు రాయితీ ఇస్తారు. ఇంకా పాలసీ గడువు ఉండి, మధ్యలో ప్రీమియం చెల్లించడం ఆపేసిన అన్ని నాన్-లింక్డ్ బీమా పాలసీలను ఈ గడువులోగా పునరుద్ధరించుకోవచ్చని ఎల్ఐసీ తెలిపింది.

# 'భారత్‌లో తయారీ'పై జర జాగ్రత్త



వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. ఈ పథకం 'మనకు అవసరమైన ఉత్పత్తులన్నీ దేశంలోనే తయారీ పథకం'గా మారకుండా చూడాలన్నారు. అలా చేస్తే చైనా౦1 వ్యూహంలో భాగంగా మన దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కంపెనీల పెట్టుబడులకు గండి పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మేకిన్ ఇండియా పథకం విజయం మన దేశ కంపెనీల పోటీతత్వాన్ని పెంచడంపై ఆధార పడి ఉందే తప్ప, వాటికి పోటీ నుంచి రక్షణ కల్పించడంలో కాదని గుర్తించాలన్నారు. అలా చేస్తే మన కంపెనీల ఉత్పాదక శక్తి కూడా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోదీ చెబుతున్న 'ఆత్మనిర్భరత'కు అసలు అర్థం రక్షణ, ఇంధనం వంటి కొన్ని కీలక రంగాల్లో వ్యూహాత్మక స్వయం సమృద్ధే తప్ప, అన్ని రంగాల్లో పూర్తి స్వయం సమృద్ధి కాదని అర్థం చేసుకోవాలని సుబ్బారావు కోరారు.సుంకాల పోటు తప్పదు: అమెరికా మన దేశంపై విధిస్తున్న సుంకాలపైనా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అవునన్నా కాదన్నా అమెరికా మనకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్ అనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఈ సుంకాల పోటుతో 'మేకిన్ ఇండియా' ద్వారా మన దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని మోదీ లక్ష్యానికీ గండి పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో చైనా౦1 వ్యూహంలో భాగంగా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకునే విదేశీ కంపెనీలు వెనక్కి తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల 27 నుంచి ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకంతో కలిపి 50 శాతం సుంకాలు అమల్లోకి వస్తే, ఆసియాలో మన దేశంపైనే అత్యధిక సుంకాలు ఉన్నట్టవుతుందన్నారు. అలాంటి స్థితిలో ఏ కంపెనీ కూడా మన దేశంలో తమ యూనిట్ పెట్టి అమెరికాకు ఎగుమతి చేయలేదని సుబ్బారావు స్పష్టం చేశారు. సగం ఎగుమతులపై ప్రభావం ట్రంప్ సుంకాల ప్రభావం అమెరికాకు మన దేశం ఎగుమతి చేసే కనీసం సగం ఎగుమతులపై ఉంటుందని సుబ్బారావు స్పష్టం చేశారు. ఈ సుంకాలతో ముఖ్యంగా ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న వస్త్ర, రత్నాభరణాలు, తోలు ఉత్పత్తుల కంపెనీలు ఎక్కువగా దెబ్బతింటాయన్నారు. ఫార్మా, ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులను ప్రస్తుతానికి సుంకాల నుంచి మినహాయించడం తాత్కాలిక ఉపశమనంగానే చూడాలని సుబ్బారావు కోరారు. భవిష్యత్‌లో వీటిపైనా సుంకాల పోటు తప్పక పోవచ్చన్నారు. ఈ సుంకాల నేపథ్యంలో మరో ఐదేళ్లలో భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మూడింతలు పెంచి 50,000 కోట్ల డాలర్లకు పెంచాలనే లక్ష్యమూ సాధ్యం కాదని స్పష్టం చేశారు.అమెరికా సుంకాల పోటుతో చైనా తన వస్తువులను ఇతర దేశాల మార్కెట్లలో కుమ్మరించే ప్రమాదమూ ఉందని సుబ్బారావు హెచ్చరించారు.

# ఏఏఏఐ బోర్డులో శ్లోకా శ్రీనివాస్



హైదరాబాద్: అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) డైరెక్టర్ల బోర్డులోకి శ్లోకా అడ్వర్‌టైజింగ్ అధినేత శ్రీనివాస్ తిరిగి ఎన్నికయ్యారు. భారతీయ అడ్వర్‌టైజింగ్ రంగంలో శ్రీనివాసకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. శ్లోకా అడ్వర్‌టైజింగ్ స్థాపించిన నాటి నుంచి ఏఏఏఐ బోర్డులో ఆయన ప్రస్థానం కొనసాగుతూ వస్తోంది. ఏఏఏఐ బోర్డు కొత్త ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శ్రీనివాసన్ కే స్వామి సహా బోర్డులో సభ్యులుగా ఉన్న ఇతర ప్రతినిధులతో కలిసి పనిచేసే అవకాశం లభించటం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని అన్నారు. అడ్వర్‌టైజింగ్ పరిశ్రమను మరింత పురోభివృద్ధిలోకి తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006